జీవిత మాధుర్యం

శ్రీ మల్లాది సత్యనారాయణ

జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు ప్రతి మానవునకు మంచిరోజులు వస్తాయనీ అప్పుడే జాగ్రత్తగా ఆ మంచిరోజుల్ని సద్వినియోగం చేసుకున్నవాడే నేర్పరి అనీ అయితే ఆ మంచిరోజులకోసం నిరీక్షణ ఓర్పు చాలా అవసరం అనీ గోపాలానికి తెలియకపోలేదు. అయితే కాలగర్భంలో కొన్ని సంవత్సరాలు కలిసిపోయి యెప్పుడు చూచినా గొర్రెకు బెత్తెడుతోకే అన్నట్లు యెదుగూ బొదుగూ లేని తన జీవితాన్ని తలచుకుంటూంటే మంచిరోజులు వస్తాయన్న నమ్మకం కాస్తా నశించింది గోపాలానికి. నశించిపోవడమే కాకుండా ఆ మంచిరోజులు అన్నపదం ఎవరినోటి వెంటేనా వినపడ్డప్పుడల్లా యెవరికి మంచిరోజులు అనే ప్రశ్న వెనువెంటనే వెలువడేది. కాని ఆ ప్రశ్నకు సమాధానం తనలోపలే అణగిపోయేది.

సంవత్సరం పొడుగునా వాన అనక వరద అనక, ఎండనక కొండనక, పురుగనక పుట్ర అనక, రెక్కలు ముక్కలు చేసుకుని పొలం పండించిన వానికి యెంత నిరీక్షించినా మంచిరోజులు రావు. భూమిగల ఖామందుకు యెప్పుడూ మంచిరోజులే వస్తూంటాయి. పగలు పన్నెండుగంటలూ రక్తం ధారవోసి మిల్లులో పనిచేసే కార్మికుడు ఎంత నిరీక్షించినా యెంత ఓర్పు వహించినా మంచిరోజులు రావు. మిల్లు యజమానికి మూడువందల అరవై నాలుగురోజులూ మంచిరోజులే.

కష్టపడే దొకడు అనుభవించేది యింకొకడు అనే సిద్ధాంతం వేళ్ళుపాతుకు పోయిన మనదేశంలో అందరికీ మంచిరోజులు యెప్పుడూ రావు. కొందరికే వస్తూంటాయి. అందుచే గోపాలానికి ఆ మంచిరోజులు అన్నమాట వింటే హేళనగా ఉంటుంది.

షాహుకారు వెంకటసుబ్బయ్య యిచ్చిన ఆర్డరు ప్రకారం సరుకు కొనడానికి తెల్లవారుఝాము బండికే బయలుదేరే నిమిత్తం షాహుకారిచ్చిన యెనిమిదివందల రూపాయలు జాగ్రత్తగా జాలెం సంచిలో భద్రపరచి నడుం చుట్టూ కట్టుకొని బయలుదేరి యింటికి వస్తున్న గోపాలానికి ప్రొద్దుటినుంచి తిండిలేనందున కళ్ళుతిరుగుతున్నాయి తన తిండిమాట దేవుడెరుగు. చంటిపిల్లకి ప్రొద్దుటినుంచి పాలులేవు. పాలడబ్బా నిన్ననే అయిపోయింది. ఈ సాయంత్రం పాలడబ్బా కొనుక్కు వెళ్ళకపోతే యీ రాత్రి పిల్లని పట్టుకోగలరా? పాలడబ్బామాట తలపునకు వచ్చేసరికి గుండె గుభేలుమంది. ఏం పెట్టికొంటాడు పాలడబ్బా. నెలాఖరు అయి ఒకటవ తేదీ వస్తేనే కాని షాహుకారు వెంకటసుబ్బయ్య జీతం యివ్వడు. ఇవ్వడు అంటే షాహుకారు కేమీ తప్పులేదు. ఎందుచేతనంటే గోపాలం షాహుకారు చుట్టూ పని యిప్పించమని తిరిగినప్పుడే షాహుకారు వెంకటసుబ్బయ్య కొన్ని షరతులు జాగ్రత్తగా బిగించి గోపాలంచేత సంతకం చేయించుకున్నాడు. అప్పటికి ఆమోదించి ప్రవేశించాడు గోపాలం.

నెలలో మధ్యగా యెప్పుడూ జీతం తాలూకు డబ్బులో కొంతకూడా అడగడానికి వీలులేదు. నెలా పూర్తి అయ్యాక ఒకటవ తేదిని పూర్తిగా జీతం యిచ్చే షరతు మొదటిది.

ఇక రెండవది గుమాస్తా సంఘాలలో చేరడం గాని సమ్మెలలో పాల్గొనడంగాని యెంతమాత్రం కూడదు.

మూడవది. ఇష్టం లేకపోతే పనిమాని వేయడం తప్ప జీతం పెంచమని యెప్పుడూ అడగకూడదు.

నాల్గవది. లేబరాక్టు రూల్సు అంటూ ఆదివారాలు పనిమానడానికి వీలులేదు. ఎంత అత్యవసరమైన పని అయినా షావుకారు పర్మిషను తీసికొననిదే మానడానికి వీలులేదు.

అయిదవది. పని యేమాత్రం తృప్తికరంగా లేకపోయినా గోపాలాన్ని పనిలోనుంచి తప్పించెయ్యడానికి నోటీసులతో నిమిత్తంలేకుండా పూర్తిహక్కులు షావుకారుకున్నాయి.

ఆరవది. నెలజీతం అరవై రూపాయలు అయినప్పటికి షావుకారు అంకెలు యెంత యెక్కువగా వేసి సంతకం పెట్టమన్నా గోపాలం సంతకం పెట్టి తీరాలి.

ఇన్ని షరతుల కంగీకరించి ఉద్యోగంలో ప్రవేశించిన గోపాలం యీ రోజు యింట్లో బియ్యంలేక పస్తుపడుకోవలసి వచ్చినా. చంటిపిల్లకు పాలడబ్బా లేకపోయినా షావుకారుని యేమని అడుగుతడు? కనీసం చెప్పడంకూడా తన అసమర్థతను సూచిస్తుందని చెప్పలేదు.

ఎన్ని షరతులు బిగించినా ఆ నాటి ఆదుర్దా కొద్దీ గుమాస్తాపనికి ప్రవేశించాక యీనాడు షావుకారు దయతలచలేదని అఘోరించి వాళ్లిదగ్గఱ వాళ్ల దగ్గఱ షాహుకారు యిల్లా చేస్తున్నాడని చెప్పుకోవడం కూడా పొరబాటేనని గ్రహించిన గోపాలం యెవ్వరితోనూ యేమీ చెప్పకూడదనుకున్నాడు.

ఈ రోజు యెనిమిదివందల రూపాయలు మొలలో ఉన్నాయి. ఒక రూపాయి పెట్టి పాలడబ్బా కొని నాలుగురూపాయల బియ్యంకొని యింటికి పట్టుకువెడితే... ఈ అయిదురూపాయలకి యేం జమాఖర్చు చెప్పాలి. ఒకటవ తేదీ యింకా పదిరోజులకి గాని రాదాయెను. వెనవ ఒకటవ తేదీ ముప్ఫయి రోజులు గడిస్తేనేగాని రాదుగదా. ఈ ముప్ఫయి రోజులయినా బురదపాము పందంగా నడుస్తాయి. కనిపెట్టుకుకూర్చున్నా ఆ ఒకటవ తేదీ వసుందన్నమాటేగాని త్రాచుపాములా జర్రున జారిపోయి ఊరుకుంటుంది. పదిహేను రోజులకోసారి ఒకటవ తేదీ వస్తూంటే బాగుండు ననిపించింది గోపాలానికి. ఏమయినాసరే బియ్యం పాలడబ్బా కొనుక్కు వెళ్ళడానికే నిశ్చయించుకున్నాడు. లేకపోతే యెట్లా? తనేదో ఉద్ధరిస్తాడని జీవితాంతం పోషిస్తాడని నమ్మి మెడలో పుస్తెకట్టించుకున్న భార్యకు బియ్యం తేలేకపోయానని ఏ ముఖంపెట్టుకు చెబుతాడు.

ఇంతకీ పెద్దవాళ్ళకి బుద్ధిలేదు. చిన్నతనంలోనే గుదిబండని మెడగట్టేసి వాళ్లబాధ్యత వాళ్ళు తీర్చుకుంటే సరేననుకున్నారుగాని తరువాత వచ్చే గోపాలం బాధలు కొంచెమేనా గమనించగలరా? అయితే ఒకటి. కాలమానపరిస్థితినిబట్టి ఇప్పుడెంత తెచ్చినా చాలడం లేదుగాని గోపాలం చిన్నతనంలో వాళ్లినాన్న యెలిమెంటరీ స్కూలు మాస్టరీ చేసేటప్పుడు నెలకు పదుహేడున్నర జీతం యిచ్చేవారు. ఆ డబ్బుతో నలుగురు పిల్లలతో సంసారాన్ని యీదుతూ అప్పుడప్పుడు ఒక్కొక్క కాసు బంగారం (అప్పుడు కాసెంత? పదమూడున్నరేగా) కొని గోపాలం తల్లికి చెల్లెళ్ళకి మురుగులనీ మెళ్ళో యేవో ఆంజనేయ బిళ్ళలనీ చేయిస్తూఉండేవాడు. ఇప్పుడు గోపాలానికి షాహుకారు నెలకు అరవైరూపాయలు యిస్తాడు. తాను భార్య యిద్దరు పిల్లలు బ్రతకడం కష్టం అయిపోతోంది. ఇరవయ్యో తారీఖువఱకు చచ్చి చెడి యీడ్చుకొస్తున్నాడు. అక్కడినుంచి నెలాఖరు వరకు రోజూ యేకాదశులు, శనివారాలు, కార్తీక పౌర్ణములు. ఎవరినీ చెయిచాచి అడగలేడు. గోపాలం చిన్నతనంలో "ఈ రోజుల్లో పెళ్ళాన్ని పోషించుకోలేనివాడెవడు?" అనేవారు. అప్పుడు జీవితం అంత తేలికగా ఉండేది. ఇప్పుడెంత బరువైందో గోపాలం లాంటివాళ్ళకే తెలుస్తోందిగాని తక్కినవాళ్ళకేం తెలుస్తుంది.

తనూ తన భార్య ఏ పసులు పడుకునో జీవితాన్ని గడిపేద్దామనుకుంటే వీలులేకుండా ఇద్దరుపిల్లలు కూడాను. గోపాలం దరిద్రానికి సాయం భార్య కాపురానికి వచ్చి యిరవైయేళ్లయితే యిప్పుడు పుట్టుకొస్తున్నారు పిల్లలు, ఏది తక్కువయినా పిల్లలు పేచీ పెడతారు కదా. వాళ్లికేం కావాలి సంసారంలోని బాధలు. పెద్దపిల్ల బృంద చూచినదల్లా కావాలని యేడుస్తుంది. ఇంక చంటిపిల్ల కవన్నీ తెలియవు. పాలు లేకపోతే యేడుస్తుంది. పస్తు పడుకునే తల్లిదగ్గర పాలెలా ఉంటాయి?...

పిల్లల భవిష్యత్తుకోసం బల్లలుగుద్ది ఉపన్యాసాలిచ్చే అగ్రనాయకులు చేసిందేమిటి? గట్టిగా అడిగితే తిండి పెటలేనప్పుడు యెందుకు కనాలి? సంతాన నిరోధానికి అనేక సాధనాలున్నాయిగా? ఆచరణలో పెట్టకూడదా అంటారేగాని జీవన పరిమాణం హెచ్చినందువల్ల తిండి పెటలేకపోతున్నాడనే ఆలోచనే రాదుగా. జీవన పరిమాణం హెచ్చడానికి కారణం ఏమిటీ అంటే స్వతంత్రం వచ్చింది గనుక దేశంలో అన్ని విషయాలు సక్రమపద్ధతిలో సర్దుకునే సరికి కొంతకాలం పడుతుంది. 'మేమూ మా శాయశక్తులా తంటాలు పడుతున్నాము. పంచవర్ష ప్రణాళికలు అమలుపరుస్తున్నాం. ఒక్కొక్క రాష్ట్రానికి రెండు, మూడు విశ్వవిద్యాలయాలు స్థాపించి విద్యాభివృద్ధి చేస్తున్నాం.' అంటారేగాని దిగమింగుడు దేవతలు అంకుశ్లులేకుండా యెంత మింగేస్తున్నారో, ఎందఱు పానకాలరాయుళ్ళు పానకంలాగ తాగేస్తున్నారో, ఎంత దుబారా ఖర్చులక్రింద కేళీవిలాసాలక్రింద ఖర్చవుతోందో, ఎన్ని అనవసరమయిన టియ్యే బిల్లులు ప్యాసవుతున్నాయో? తెలియదు గనుకనా? అందరికీ తెలుసు? అయినే...? క్వశ్చిన్ మార్క్. అది సాల్వుకాని సమస్య. పైకి చెప్పుకోడానికి విలువలేని సహస్ర వర్షప్రణాళిక. తెలిసికూడా తెలియనట్టు నటించవలసిన రాజకీయ రహస్యం. బయటపెడితే మొదటికే మోసం వచ్చే చిదంబర రహస్యం... మనకెందుకు పోనివ్వండి.

అనేక ఆలోచనలు బుర్రలో పరుగెడుతున్నాయి గోపాలానికి. పాప బోసినోటితో నాన్న పాలడబ్బా తెస్తాడని ఎదురుచూస్తూ ఉంటుంది. వట్టిచేతుల్తో తాను వెడితే పాలడబ్బా కూడా కొనలేనివాడవు నన్నెందుకు కనాలి? నందనోద్యానవనం కావలసిన నా జీవితాన్ని మొలకెత్తేసరికే తుంపెయ్యదలుచుకున్నావా?

నాకు జన్మనిచ్చిందెందుకు? నాకా జన్మనిమ్మని నిన్నేం బ్రతిమాలలేదే?' అని అడుగుతుందేమో ?

ఉదయం బయలుదేరి యింట్లోంచి వచ్చే టప్పుడు పెద్ద పిల్ల బృంద "నాన్నగారూ! వాళ్ళ పాప ఎక్కి కూచుంటే ... ఊఁ... ఊఁగుతోందీ...అలాంటి ఊగే గుఱ్ఱాన్ని నాకు పట్టుకు రాలూ" అంది కాళ్ళ కడంపడి, గోపాలం అల్లాగే లేమ్మా అన్నాడు అదెంత పని అన్నట్టు. ఆ గుర్రాన్ని కొనడం గోపాలానికి సాధ్యమా? అప్పుడే కొననని చెబితే తీరిపోను గా. ఆశ పెట్టుకు యెదురు చూడదు గా పిల్ల. పిల్లని ఊరుకో బెట్టడానికి అల్లాగే అనడం తరువాత పిల్లని నిరాశలో ముంచెత్తి నీరసింపచెయ్యడం ఇదీ మనబాలల భవిష్యత్తు.

ఎందుకింత నైరాశ్యం. మొలలో యెనిమిది వందలున్నాయి. ఏమైనాసరే ఖర్చుపెట్టి కావలసినవన్నీ కొనుక్కు వెడతానని గబగబ నడుస్తున్నాడు.

“ఇతరుల సొమ్ము ఖర్చుపెటడానికి నువ్వెవరవోయి. నిన్ను నమ్మి వ్యాపారం చేసుకు రమ్మని షావుకారు నీచేతికి డబ్బు యిస్తే ఖర్చుపెడతావా? ఇదేనా న్యాయం? ఒకటవ తేదీ వచ్చేసరికి అరవై రూపాయలు చేతిలో పోస్తున్నాడే. అల్లాంటి షావుకారుని అన్యాయం చేస్తావా?” అని అంతరాత్మ ఘోషించింది. ఆ సంచిలోంచి ఒక్క రూపాయికూడా తీయకూడదనుకున్నాడు.

అల్లాగే నీరసంగా కాళ్ళీడ్చుకొంటూ వస్తున్నాడు. ఎదురుగా ఫుట్ పాత్ మీద ఒక పంజరంలో చిలుకను బెట్టుకొని ఏవో కొన్ని మడతలతో ఉన్న కాగితాలు ఎదర బెట్టుకొని ఒక ఆసామీ” పక్షిపలుకుతుంది నీభవిష్యత్తు రా తమ్ముడూ” అంటున్నాడు.

గోపాలం యేమీ తోచక ఆపక్షి యేం చెబుతుందోనని యాంత్రికంగా నడిచి అక్కడికి వెళ్ళాడు ఆ ఆసామీ అణా యిమ్మన్నాడు. జేబులో యెప్పటినుంచో ఒక చిల్లి కాని ఒక నయా పైస స్నేహం చేస్తున్నాయి. పాత క్రొత్తల కలయికలో దాస్య స్వాతంత్రాల కలయిక కాలం అన్నటున్న ఆ చిల్లికాని ఆ నయా పైసల స్నేహాన్ని అమాంతంగా విడదీసి చిల్లికాని యిస్తానన్నాడు. పాపం యెందరి భవిష్యత్తైనా చెబుతాడు గాని తన భవిష్యత్తు తనకే తెలియని ఆ ఆసామీ ఆ చిల్లికానీకే కక్కుర్తిపడి తీసికొని చిలకని పంజరంలోంచి బయటికి తీశాడు.

“అమ్మయ్య! నా చిల్లికానీ ధర్మమా అంటూ ఈ రెండు నిమిషాలేనా స్వతంత్రం యిచ్చాడు పాపం ఆ చిలకకి అని సంతోషించాడు గోపాలం. కాని ఆ వెను వెంటనే ఎగరడానికి వీలులేకుండా చాటుగా రెక్కలు కత్తిరించి బహిరంగంగా స్వతంత్రంయిచ్చావని చూపించే ఆ ఆసామీ మోసం చూస్తే పాపం గోపాలానికి యేవేవో జ్ఞాపకం వచ్చాయి. ఆ జ్ఞాపకం వచ్చినవన్నీ పైకి చూపించడానికి వీలులేని ఆణిముత్యాలు. చూపిస్తే యేదో వంక బెట్టి యేదూచలు లెక్క బెట్టించే పరమసత్యాలు.

ఆ చిలుక కాగితాల మడతలలోని ఒక మడతను ముక్కుతో లాగింది. ఆ ఆసామీ మడతవిప్పి చదవడం మొదలుపెట్టారు.

“నీకు యిప్పుడు చాలా మంచిరోజులు. నీ ఆలోచనలు న్యాయంవైపునకే మొగ్గుచూపుతాయి. నీ పవిత్రతే నిన్ను కాపాడుతుంది. కంగారుపడి బురదలో అడుగువెయ్యకు. వేశావా జీవితాంతం వదలదు” అని చదివాడు.

ఎక్కడలేని కోపంవచ్చింది గోపాలానికి. ఏమాటంటే కడుపు రగిలిపోతుందో అదే యిక్కడ కూడా ప్రత్యక్షమైంది. ఇప్పుడు చాలా మంచిరోజులట. అందుకే కొంపలో బియ్యంలేవు. అప్పిచ్చే దాతా లేడు. అరువిచ్చే షావుకారూ లేడు. ఎవరికి మంచిరోజులు ... నాకుకాదు. మంచిరోజులు మా షావుకారుకు వచ్చాయి. ముందెన్నో రాబోతున్నాయి. నెలరోజుల క్రితం లెక్కలుచూచుకోగా వ్యాపారంలో పన్నెండు వేలు లాభంవస్తే యీనాలుగు రూపాయలు పెట్టి చొక్కా కుట్టించుకోమని యివ్వలేక పోయాడు. ఇక నాకు మంచిరోజులేవిటి?...

వెధవరాతలు వీడూను. ప్రతీ కాగితం మడతలోను యిల్లాగే రాసిఉంటుంది. బహుశః వీడిదగ్గరికి వచ్చినవాడికల్లా మంచిరోజులు వస్తూనే ఉంటాయి. కాని వీడికిమాత్రం మంచిరోజులు రావుకాబోలు. వస్తే వీడికీ ఫుట్ పాత్ మీద నివసించే ఖర్మంయేమిటి? మంచిరోజులమాట యెట్లాఉన్నా పిల్లయేడిస్తే కనీసం కాసన్ని బఠానీలేనా కొనిపెట్టకుండా చిల్లికానీకి మాత్రం ఖరాబుపట్టింది. బుర్రగోక్కుంటూ రెండు కాళ్ళకి బుద్ధిచెప్పి గోపాలం ఘటాన్ని యింటికి నడిపిస్తున్నాడు.

అదే ఫుట్ పాత్ మీద పెద్దచెయ్యి బొమ్మఉన్న అట్టఒకటి పెట్టుకుని ఏవో పెద్ద పెద్ద గ్రంథాలు దగ్గర పెట్టుకుని కూర్చొన్నాడొక పెద్దమనిషి. పెద్దతలపాగ, కోటు, ఆ కోటుకి నాలుగు మెడల్సు. (బంగారానివో గిల్టువో చెప్పలేం అనుకోండి) వేషంమాత్రం హంగు

గానే ఉంది. అగరువత్తుల సువాసనలు ఆఘ్రాణిస్తూ హస్తసాముద్రికశాస్త్రంలో ఆరితేరిన మొనగాడిలా ఎబ్బెట్టుకుంకం బొట్టుతో ఆకర్షిస్తున్నాడు గోపాలం లాంటి అపహాయుల్ని.

పక్షిపలికే భవిష్యత్తుకోసం ఆశించిన గోపాలాన్ని చూశాడు. పడింది తనవలలో పిట్ట. పట్టింది వాడి డబ్బులకు ఖరాబు అనుకున్నాడు. ఒక చేత్తో కోరమీసాన్ని దువ్వుతూ హస్తసాముద్రికం చెబుతాం సార్ అన్నాడు గోపాలాన్ని చూచి.

చిరాకు వచ్చింది గోపాలానికి "వీడూ మంచి రోజులనే చెబుతాడు. చెడురోజులని చెబితే రాగి పైసా యివ్వడు యెవ్వడూను. ఇదొకరకం బ్రతుకు తెరువు" అనుకుని సమాధానం చెప్పకుండా తలవంచుకు తొందరగా నడుస్తున్నాడు.

తనలో తనకే నవ్వువచ్చింది. "మంచి రోజులట మంచి రోజులు" అనుకున్నాడు మరోసారి. అంతలోనే ఎవరో వీపుమీద చరిచి ఏదో చెబుతున్నట్టయింది.

"అవును. నీకు మంచి రోజులు గనుకనే నీ షావుకారుకు పన్నెండు వేలు లాభం వచ్చింది. నీ షావుకారుకు లాభంరాక నష్టంవచ్చి ఉంటే వ్యాపారమే మానివేసిఉండేవాడు. అప్పుడు నీగతి యేమవుతుంది. గుమాస్తా పనికోసం ఎక్కే గుమ్మం దిగే గుమ్మం జ్ఞాపకముందా? ఆ అవస్థనుండి తప్పించాడు నీ షావుకారు. లాభం వచ్చింది గనుకనే మళ్లీ వ్యాపారం సాగించాడు. కనుకనే ఏ నెల అదైనా ఆ నెల ఎగగొట్టకుండా యిస్తున్నాడు. పన్నెండు వేలు లాభంవస్తే చొక్కాగుడ్డ కుట్టించలేదని బాధపడుతున్నావా? అలా ఎందుకు ఆశించాలి? అరవై రూపాయల జీతానికి చాకిరీచేస్తానని కుదిరావు. నీ షావుకారుకు నష్టం వచ్చిఉంటే నీ జీతంలో ఒక్క రూపాయి తగ్గించుకుందుకు నువ్వు ఒప్పుకుంటావా? నీ యజమాని బాగుండాలని కోరుకో. పొదుగు పిండి పాలు త్రాగడానికే ప్రయత్నించు. పొదుగుకోసి పాలు త్రాగడానికి ప్రయత్నించకు. నీతోటి గుమాస్తా నీ షావుకారుకు యెదురు తిరిగి యేం చెయ్యగలుగుతున్నాడు. కోర్టులచుట్టు తిరుగుతున్నాడు. లేబరాక్టు యేదో ఉద్ధరిస్తుందని. బ్రతుకు తెరువుకు కావలసింది సామరస్యంగాని యాక్టులు, కోర్టులు గావు. మళ్ళీ ఎవడైనా గుమాస్తాగా పెట్టుకున్నాడా? ఎందుకు పెట్టుకుంటాడు? వెర్రివాడా! న్యాయంగా నీకు రావలసినదానికే ప్రయత్నించు. అన్యాయంగా ఒక్క కాని కూడ ఆశించడానికి ప్రయత్నించకు. కష్టాలు వస్తాయి. నిగ్రహించుకోవాలి. అప్పుడే ఓర్పు చూపించాలి. కష్టాలుకూడా ఉన్నప్పుడే సుఖాలయొక్క విలువ తెలుస్తుంది. అప్పుడే నిజమైన జీవితమాధుర్యాన్ని అనుభవించగలుగుతాడు మానవుడు."

వెనక్కు తిరిగి చూచాడు గోపాలం. ఎవ్వరూ లేరు. ఆలోచించాడు. తనహృదయమే తనకు చెప్పిందనుకున్నాడు. తనకు వినిపించిన మాటలన్నీ యదార్థమే ననుకున్నాడు. పొదుగుపిండి పాలుతాగాలిగాని కోసుకుతాగడం పొరబాటే ననుకున్నాడు. కష్టాలున్నప్పుడే సుఖాలయొక్క విలువ తెలుస్తుందనుకున్నాడు. ఈ రెండు విషయాలు శిలాక్షరాల్లా హృదయంలో నాటుకుపోయాయి గోపాలానికి. మననం చేసుకుంటూ కాళ్ళీడ్చుకుంటూ ఘటాన్ని యింటికి జేరేశాడు.

తండ్రి రాకకోసం ఎదురుచూస్తూ వీధిగుమ్మాన్ని పట్టుకు నిలుచున్న బృంద తండ్రిరాగానే కాళ్ళకు చుట్టుకొని "నాన్నగారూ! నాకు గుల్లం పట్టుకు వచ్చారా?" అంది. ఏం చెప్పాలో తెలియలేదు గోపాలానికి. కళ్ళనీళ్ళు తిరిగాయి. కనిపెట్టింది భార్య సుగుణ. బృందని చంక నెత్తుకుంది.

జోహా అదేమిటామాట!
సంతానం కుళ్లి కృషిస్తూ ఉంటే
తల్లికి క్షోభ కాదూ?
భారతీ-భారతాంబ బొల్లి,
సమస్తచర్మవ్యాధులచేపీడింప
బడుచున్న తన సంతానం
కోసం ఎంత విచారిస్తూ ఉందో?
(స్థాపితము 1920 సం॥రం)
ఇదుగో మా చిరకాల అనుభవంతో
ఇస్తూ ఉన్న అభయం.
మాకు నేడే వ్రాయండి
రెడ్డి అండ్ కో.,
గోపాలపురం. (తూ.గో.జి)

"ఛీ! అల్లాంటి గుర్రం యేంబాగుంటుంది. దాని మీదనుంచి పడిపోతే దెబ్బ తగులుతుందమ్మా" అంది.

"ఎందుకు తగులుతుంది."

"ఆ గుర్రం పడగొట్టేస్తుంది."

"ఎందుకు పడగొత్తుతుంది? మరి వాళ్ళపాపని పడగొత్తదేం"

"దానికి కోపం వచ్చినప్పుడు పడగొడుతుంది."

"ఎప్పుడొస్తుంది కోపం?"

"ఎప్పుడో వచ్చేస్తుంది. ఇంకా కావలిస్తే నాన్నగారిని అడుగు." అంది భర్తని బాధాసముద్రంలోంచి కాస్త మేల్కొల్పాలని.

"ఏమండి నాన్నగారూ! గుర్రానికి కోపం వొచ్చి పడగొత్తుతుందా?" అంది బృంద, కూర్చున్న తండ్రి ఒళ్లో కెక్కి చొక్కా గుండీలు సర్దుతూ.

"అవునమ్మా" అన్నాడు గోపాలం. సుగుణ మాదిరిగా సర్ది చెప్పేవిధానం తనకు తోచలేదనుకున్నాడు.

"అయితే నాన్నగారూ! చెదకగుర్రం మనకొద్దు" అంది బృంద బుంగముఖం పెట్టి తండ్రితో.

జాలేసింది గోపాలానికి. సిగ్గూ వచ్చింది తన అసమర్థతకు.

బిడ్డల కోర్కెలు తీర్చలేనివాళ్లు ఎందుకు కనాలి. కని వాళ్ళ ఆశల్ని సమూలంగా నాశనంచేసి వారి పురోభివృద్ధి నెలా అరికడుతున్నారో యీనాడు అర్థమైంది గోపాలానికి. తనకీ పాఠం నేర్పిన బృందను ఒక్క ముద్దు పెట్టుకున్నాడు.

మరి యీముద్దో అని రెండోబుగ చూపించింది బృంద. బాధంతా మటుమాయమయి రెండో ముద్దు కూడా పెట్టుకున్నాడు.

క్షణకాలం జరిగిపోయింది.

"సుగుణా! కాసిన్ని మంచినీళ్ళు అందుకుంటావా?"

"కొంచెం మజ్జిగ దాహం తాగరాదూ ఉప్పువేసి యిస్తాను."

"మరి నువ్వుకూడా తాగవు? ఇవ్వాళటికి ఇదరం చెరో కాస్త ఆ మజ్జిగ తాగి పడుకోవలసిందే. క్రిందటి జన్మలో ఎవరినోటిముందు అన్నమో లాగేశాం. ఈ జన్మలో తిండికి మొఖంవాచాము" అన్నాడు కన్నీళ్ళతో గోపాలం.

'అదేమిటండీ ఇంతమాత్రానికే...మీరే కంట తడిపెడితే నే నేమైపోవాలి చెప్పండి...మనమాటకేం పాపం పాపకి ప్రొద్దుటినుంచీ పాలు లేవు"

"అవును కనడంమాత్రం కన్నాము. గుక్కెడు పాలు పొయ్యలేకపోతున్నాం. మనలాంటి గర్భదరిద్రుల కడుపున యెందుకుపుట్టాలి. మరి బృంద నేలా ఊరుకోబెటావు."

"నిన్న వండగా గిద్దెడుబియ్యం మిగిలాయి. అవి వండి దానిముట్టుకు పెట్టాను."

"మంచిపని చేశావు పాపకి పాలు లేవు."

"పాపం ఆ యెదురింటివారి లక్ష్మి క్షణంక్రితం వచ్చింది. ఏదోమాటల సందర్భంలో పాలడబ్బా అయిపోయింది. తేవాలి అనిచెబితే పాపం వాళ్ళ పాలడబ్బాలో పాలుకలిపి పట్టుకువచ్చి యిచ్చింది. యిప్పుడే"

"మరి పట్టించావా"

"ఏదీ? ఆవిడా వెళ్లింది. మీరూవచ్చారు. మీకు మజ్జిగయిచ్చి పాపకి పాలు పట్టిస్తాను. అని తొందరగా నే వంటయింట్లోకి వెళ్లిపోయింది.

'సుగుణా' అన్నాడు కన్నీళ్లతో గోపాలం.

'ఏమండీ' అని దగ్గరకు వచ్చింది. చూచింది. "ఏమిటండీ అది చిన్నపిల్లాడిలా" అని కళ్లనీళ్లు తుడుచుకుంది.

"ఇంత అసమర్థుడైన భర్తను కట్టుకుని యేం సుఖపడుతున్నావు సుగుణా"

"అబ్బ!......ఏంమాటలండీ అవి.

"కూటికికూడా గతిలేని కాపరం ఎందుకొచ్చిన కాపరంరా అనుకుంటోందికదు నీ మనస్సు సుగుణా."

ఆ మాట బాణంలా గుచ్చుకుంది సుగుణ హృదయానికి, తీక్షణంగా చూచింది భర్తవంక "నేను బ్రతికుండడం మీ కిష్టం లేదా!" అంది బాధగా.

"లేదులే సుగుణా. వెళ్ళి మజ్జిగ పట్టుకురా. చెరో గుక్కెడు తాగుదాం."

"ఇంకెప్పుడు అలాంటి మాటలనవని ప్రమాణం చెయ్యండి."

"లేదులే సుగుణా. వెళ్ళి మజ్జిగ తీసుకురా."

కన్నీళ్ళతోనే వంటయింటి గుమ్మంలోనికి వెళ్ళింది. పిల్లి మూతి నాకుకుంటూ యెదురుగా వచ్చింది. సుగుణ చూచింది. గుండె గుభేలుమంది. మూత పడగొట్టి మజ్జిగ కాస్తా పిల్లి తాగేసింది. కళ్ళ నీళ్లు గిర్రున తిరిగాయి. అక్కడే కూలబడింది. ప్రొద్దుటినుంచీ యిద్దరికీ తిండిలేదు. భర్త యింటికి వచ్చాక ఒకవేళ బియ్యం దొరక్కపోతే యిద్దరూ చెరో గుక్కెడు ఆ మజ్జిగ త్రాగి యీ రోజు గడప వచ్చుననుకుని, మధ్యలో ఆకలిబాధ అణుచుకోలేక పోయినా, మజ్జిగ త్రాగకుండా అలాగే అట్టే పెట్టింది. భర్తకు పట్టుకు వస్తానని చెప్పి లోపలికి వచ్చింది. ఏ ముఖం పెట్టుకు భర్త దగ్గరకు వెడుతుంది? ఏమని చెబుతుంది?

పాప పాలులేక తొట్టెలో ఏడుస్తోంది. ఎంత సేపటికి మజ్జిగ తీసుకు రాకపోవడంచేత గోపాలం 'సుగుణా!' అన్నాడు. జవాబు రాలేదు. ఉదయం నుంచీ భోజనం లేకపోవడంచేత కళ్లు తిరిగి పడిపోయి ఉంటుందేమోనని కంగారుపడి వంటయింట్లోకి వచ్చాడు. సుగుణ ముఖం రెండు చేతులలో మూసుకుని ఏడుస్తోంది.

'ఏమిటి సుగుణా' అన్నాడు భయంగా.

'పిల్లి మజ్జిగ కాస్తా తాగేసింది' అంది యేడుస్తూ సుగుణ.

ఇంతమాత్రానికే యేడుస్తారా? పోనీ లే పాప యేడుస్తోంది ఆపాలు కాసిన్ని పొయ్యరాదూ?" అన్నాడు.

లేచింది సుగుణ. పాలగ్లాసు తీసుకుంది. పట్టుకు వచ్చింది. పాపని లేవదీసి పాలుపొయ్యడం కోసం కాళ్లమీద పడుకోబెట్టుకుంటోంది. పాప చేతులు కాళ్లు కొట్టుకుని యేడవడంలో చెయ్యితగిలి ఆ పాల గ్లాసు పడిపోయింది.

అయ్యోఅని అరిచింది సుగుణ. తల గోడకేసి కొట్టుకు యేడుస్తోంది పిల్లకి ఆ పాలుకూడా పట్టలేక పోయా నేఅని.

గోపాలానికి నవ్వు ఏడుపు రెండూ కలిసే వచ్చాయి. కళ్ళవెంట కన్నీరు కారుస్తూ నవ్వుతున్నాడు.

ఏడుస్తూనే యెందుకు నవ్వుతున్నారంది సుగుణ.

"ఎందుకా? జీవిత మాధుర్యం అంటే మేమిటో యీనాడు తెలుసుకున్నాను నాను జీవితపు లోతుల్లో ఉండే అందం కనిపిస్తోంది సుగుణా! ఎంత విచిత్రమైన సంఘటన. మనజీవితాంతంవరకు మరచిపోగలమా? కష్టాలున్నప్పుడే సుఖాలయొక్క నిజమైన విలువ తెలుస్తుంది సుగుణా. జీవితపు లోతుల్ని తరచి చూచిన వాడే నిజమైన జీవిత మాధుర్యాన్ని పొందగలుగు తాడు. సుగుణా! నిజమైన జీవిత మాధుర్యం అనే పదానికి సరియైన అర్థం ఈ మన విచిత్రసంఘటనే సుగుణా!" అన్నాడు.

సుగుణకు యేం అనాలో తెలియక గుడ్లు వప్పగించి చూస్తోంది గోపాలంవంక.

కాళ్లమీదవున్న బోసినోటి పాప చైతన్య రహితయైవున్న సుగుణ కాళ్లమీదనుంచి దొర్లిపోయి ఒలికిన పాలల్లోపడి రెండు చేతులతో తపతప కొడు తోంది. అవ్యక్తమైన ఆనందంలో బోసినోటితో కలకల నవ్వుతూ తల్లివంక చూస్తోంది.

ఆ చూపులతో తేరుకున్న సుగుణ ఒక్కసారి పాపను తీసికొని గుండెలకు హత్తుకుని చిరునవ్వు నవ్వింది.

ప్రముఖపత్రికలూ, ప్రఖ్యాతసాహితీపరులూ ప్రశంసించిన

ఉత్తమ గ్రంథాలు

1. సంప్రణయం: పదికథలూ, గల్పికలు.
రచన: పూషా: వెల 0-50 న. పై.
2. పారిజాతం: నేటి ప్రఖ్యాత కథకుల పదకొండు కథలు. వెల రు 1-25 న. పై.
3. తెరమెరుగులు: (ఐదు ఉత్తమ నాటికలు) కుక్కపిల్ల దొరికింది (రావికొండలరావు); దొంగ (పోతుకూచి సాంబశివరావు); తెల్లవారింది (హితశ్రీ); తెరమరుగు నీడలు (కొండముది శ్రీరామచంద్రమూర్తి); త్రీలకు ప్రత్యేకం (అంగర సూర్యారావు). వెల రు 1-50 న. పై.

శోభా ప్రచురణలు, విజయనగరం సిటీ.

సరిక్రొత్త ఉపయోగమైన పుస్తకములు

వ్యవసాయము - ఇంజనీరింగు, వైద్యము, యింకా అనేక విషయములపై మా వద్ద గలవు కేటలాగు ఉచితము. ఇంగ్లీషులో వ్రాయండి.

N. K. Paul & Sons, Post 12202, Calcutta-5.